# మార్పు





-ప్రతాప వెంకట సుబ్బారాయుడు,
సికింద్రాబాద్

శ్రీకర అభయారణ్యంలో కర్రెనాసిక అనే కాకి వుండేది. అది ఆ అడవిలో అన్ని జంతువులతో సఖ్యంగా, సామరస్యంగా ఉండేది. స్వతహాగా చాలా చురుకైనది అవడంతో కర్రెనాసికంటే జంతువులన్నీ ఎంతో అభిమానం చూపించేవి.

ఇదిలా వుండగా కర్రెనాసిక అడవి పొలిమేరలు దాటి సరదాగా ఎగురుతూ వెలుపలికి వచ్చింది. అక్కడున్న బాటపై ఉన్న వస్తువొకటి మెరుస్తూ దాన్ని ఆకర్షించింది. అది వజ్రపు ముక్కపుడక. దాన్ని ముక్కు మొదట్లో ఒక పక్కగా కరుచుకుని రివ్వున ఎగిరింది. ధగధగ మెరిసే ఆ వస్తువు తన ముక్కుకి ఎలా ఉందో చూసుకోవాలన్న తహతహతో నిశ్చలంగా ఉన్న చెఱువులో తనని తను చూసుకుంది. తన అందానికి మురిసిపోతూ అడవిలోకి ఎగురుకుంటూ వెళ్ళిపోయింది.

ముక్కు పుడకతో వచ్చిన కర్రెసాసికని జంతువులన్నీ తెగపొ గిడాయి. దాంతో గర్వం తలకెక్కి, "మీరందరూ ఎప్పట్లానే ఉన్నారు. నేను మాత్రం ఇదిగో

ఈ వస్తువుతో కొత్తందం నంతరించుకున్నాను. పైగా తెలివైనదాన్ని. అందుకని ఈ రోజునుంచి ఈ అడవికి నేనే రాజును. మన రాజైన సింహం కేవలం భూమ్మీద మాత్రమే తిరగగలదు. మరినేను ఆకాశంలో సంచరిస్తూ అడవంతా చూడగలను. ఎవరికి ఏ సమస్య వచ్చిన తీర్చగలను. అందుచేత నా రాచరికాన్ని మీరందరూ అంగీకరించి తీరాలి” అంది.

కాకిలో వచ్చిన మార్పుకి చింతిస్తూ, ‘కాలమే, దానికి బుద్ధి చెపుతుంది’ అనుకుని సింహంతో సహా అన్నీ దాని రాచరికాన్ని అంగీకరించాయి. దాని ముక్కున ఆ ముక్క పుడక ఉన్నంత వరకే రాచరిక హోదా ఉంటుందనీ, అంత వరకే తనకి గౌరవ మర్యాదలనీ తెలుసుకాబట్టీ ముక్కుకున్న ఆ ముక్కెరని సదా కాపాడుకోసాగింది. దానిని కాపాడుకోవడంలో తిండి తిప్పలు మానేసింది. తిండికోసం ఆ ముక్కుపుడకని పక్కన బెడితే ఏ పక్షి వచ్చి తన్నుకుపోతుందో.. అని నిద్రపోవడం కూడా మానేసింది. దాంతో దాని ఆరోగ్యం దెబ్బతిని, క్షీణించి పోసాగింది. కొద్ది రోజులు గడిచాక ఆ ముక్కెర వల్ల తన మనశ్శాంతి పోయిందని, తనతో స్నేహంగా, అభిమానంగా మెలిగే జంతువులన్నీ దూరంగా ఉండసాగాయని తెలుసుకుంది. తన బతుకు దుర్భరం కాకుండానే.. మారాలని నిర్ణయించుకుని.. వేగంగా ఎగురుకుంటూ వెళ్ళి ఓ పాడు పడిన బావిలో ఆ ముక్కెరని పడేసి అడవికొచ్చేసింది.

ముక్కుకి ముక్కెరలేని కాకిని చూసి కర్రైనాసికలో మార్పు వచ్చిందన అర్థంచేసుకుని జంతువులన్నీ దానిని అభిమానంగా దగ్గర చేసుకున్నాయి.

